క్లుప్తంగా

అండగా ఉంటాం... అధైర్య పడకండి..

జెడ్పీ చైర్మన్ విప్పర్తి



మామిడికుదురు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడం బాధాకరమని జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం పేర్కొన్నారు. పార్టీకి ఇటువంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ మీద ఉన్న ప్రేమతో తన గెలుపు కోసం ఎన్నో కష్టాలు ఎదురైనా భరిస్తూ వైఎస్సార్ సీపీ విజయం కోసం తనతో పాటు ప్రతిరోజు వెంట ఉండి కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకులకు, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు పేరు, పేరునా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు సేవ చేయాలన్న దృక్పథంతో పని చేస్తానని, జెడ్పీ చైర్మన్‌గా తనకున్న కాల పరిమితిలో నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు ప్రయత్నం చేస్తానని వేణుగోపాలరావు స్పష్టం చేశారు.

ఉపకార వేతనానికి ఎంపికైన సుష్మశ్రీ



సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని చింతా సుష్మశ్రీ గత డిసెంబర్‌లో జరిగిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలో అర్హత సాధించినట్టు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసన్ శ్రీధర్‌కృష్ణ బుధవారం తెలిపారు. ఐదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ ఉపకార వేతనానికి సుష్మశ్రీ ఎంపిక అయిందన్నారు. దీని ద్వారా ఏటా రూ.12 వేల చొప్పున ఐదేళ్ల పాటు విద్యార్థిని ఖాతాకు నిధులు జమ అవుతాయని ఆయన తెలిపారు. కాగా ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థినికి పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జాన శంకరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముప్పర్తి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

నాలెడ్జ్ పెంచేందుకే శిక్షణ తరగతులు



మామిడికుదురులో ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులు

మామిడికుదురు: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల్లో నాలెడ్జ్‌ను పెంచేందుకే ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించామని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు భూపతి మనోహర్ రాజు, కారుపల్లి కల్యాణ్‌బాబు పేర్కొన్నారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో గత నెల 20 నుంచి గ్రామీణ ప్రాంతాలకు చెందిన 3 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు నిర్వహించిన భీమ్ విజ్ఞాన కేంద్రం సమ్మర్ క్లాసుల ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. విద్యార్థులకు మ్యాథ్స్, ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టుల్లో బేసిక్ నాలెడ్జ్‌ను పెంచేందుకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ఇవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నేల శ్రీనివాసరావు, భూపతి వెంకటపతి, బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, గెడ్డం ప్రదీప్, నీతిపూడి చంద్రరావు, సాధనాల సత్యనారాయణ, బత్తుల రమేష్‌బాబు, బయ్యా మోహనరావు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



పినపళ్లలో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, ఎంపీహెచ్‌ఈఓ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పీసీవీ, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడుకుందాం

- ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి ముప్పు
- పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ
- జిల్లా విద్యాశాఖ అధికారి కమలకుమారి, డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు



రాజోలులో పర్యావరణ ర్యాలీలో పాల్గొన్న డీఈవో కమలకుమారి, ఏపీసీ మధుసూదనరావు



మామిడికుదురులో మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

రాజోలు: పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి, డిప్యూటీ కలెక్టర్ మరియు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావులు పిలుపునిచ్చారు. రాజోలు శోభన పాఠశాల ఆడిటోరియంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ గ్రీన్ కోర్ స్టేట్ మానిటరింగ్ అధికారి జి.ప్రభావతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కమలకుమారి, మధుసూదనరావులు మాట్లాడుతూ మనిషి ఆధునిక జీవన శైలిలో వచ్చిన మార్పులు, సౌఖ్యంగా బతకాలి అనే అత్యాశతో ప్లాస్టిక్ వస్తువుల విచ్చలవిడి వినియోగంతో పర్యావరణంలో సమతుల్యత దెబ్బతింటోందన్నారు. ఫలితంగా మానవాళికి ముప్పు పొంచి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉంటూ, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ఈ నెల 19వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు సంయుక్తంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి రోజు నిర్వహించే కార్యక్రమాలను గూగుల్ ట్రాక్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులను సక్రమమైన మార్గంలో వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. రీసైక్లింగ్ విధానానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ చెత్తబుట్టల్లో ప్లాస్టిక్ వస్తువులను వేయాలని సూచించారు. పొరపాటున వాటిని విసిరేస్తే భూమిలో కలిసేందుకు 20 నుంచి 500 సంవత్సరాలు పడుతుందన్నారు. సమావేశంలో డీవైఈవో జి.సూర్యప్రకాశరావు, ఎంఈవో నల్లి మనోహరం, ప్రోగ్రాం డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎఫ్ఏవో జి.ప్రవీణ్‌కుమార్, డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతురావు, సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్ బాబు, అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, ఏపీవో డాక్టర్ ఎంఎకే భీమారావు, జిల్లా సైన్స్ అధికారి జీవీ సత్య సుబ్రహ్మణ్యం, శోభన పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జోసఫ్ తదితరులు మాట్లాడుతూ ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ అనే అంశం ఆధారంగా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ వద్దు.. జూట్ బ్యాగ్స్ ముద్దు, పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ తదితర నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి కాలుష్య నియంత్రణకు తోడ్పడతామని, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 టీఎస్‌కేడీ ప్రసాదరావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎ.నాగలక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఏడీ కృష్ణ, సీఆర్ఎంటీలు ఎంవీ రామరాజు, టి.విజయకుమారి, యు.రామలక్ష్మి, కె.రూపావతి, ఎ.దేవి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులు డీవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం మామిడికుదురులో ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. పర్యావరణం ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు నాటండి, పర్యావరణాన్ని పరిరక్షించండి అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యక్కలదేవర నాగన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముక్తేశ్వరంలో చెత్తబుట్టలో ప్లాస్టిక్ బాటిల్స్ వేస్తూ అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



గంటి నాగార్జున ప్లాంట్‌లో పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

ముక్తేశ్వరంలో...

అయినవిల్లి: ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి జేవీ కనకదుర్గ అధ్యక్షతన ప్రపంచ పర్యావరణ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కనకదుర్గ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణానికి ప్లాస్టిక్ తెచ్చే ముప్పును వివరించారు. ప్లాస్టిక్ రహిత ప్రపంచం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలోని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు సేకరించి డస్ట్ బిన్‌లో వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయులు వై.ఫణికుమార్, జి.సాయి శ్రీనివాస్, సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గంటిలో..

కొత్తపేట: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాగార్జున అగ్రికం లిమిటెడ్ ఈతకోట ప్లాంట్ హెడ్ పార్వతి కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలో గంటి సమీపంలోని ఎన్ఏసీఎల్ ప్లాంట్ ఆవరణలో బుధవారం పార్వతీకుమార్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటారు. ప్లాంట్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించి 'మొక్కలు పెంచుదాం పర్యావరణాన్ని కాపాడుదాం' అంటూ నినాదాలు చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ వివిధ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యాన్ని అరికడదాం



బట్టేలంకలో గుడ్డ సంచులు అందిస్తున్న సామాజిక కార్యకర్త బోనం రాజు

మలికిపురం: కాలుష్యాన్ని అరికడదామని బట్టేలంక గ్రామానికి చెందిన మాజాకి కార్యకర్త బోనం రాజు పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పలువురికి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మానవాళితో పాటు జీవజాతుల మనుగడ భూమి వాతావరణంపై ఆధారపడి ఉంటుంది. దురదృష్టవశాత్తూ పారిశ్రామిక విప్లవం తరువాత ఎన్నో కలుషితమైన వాయువులు వెలువడటంతో పాటు వివిధ హానికర పరిస్థితుల్లో జీవజాతుల వైవిధ్యం దెబ్బతిని అనేక సమస్యలను ఎదుర్కోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఐక్యరాజ్యసమితి 1972లో భూగ్రహ వాతావరణంలో సమతుల్యత కోసం జూన్ 5న పర్యావరణ దినోత్సవంగా డిక్లరేషన్ చేసింది. దానిలో భాగంగా ప్రతి సంవత్సరం ఒక్కో దేశంలో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుతూ మానవాళిని చైతన్య పరుస్తూ కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని జీవజాతుల మనుగడకు మహమ్మారిగా పరిణమించిన ప్లాస్టిక్ నిరోధించేందుకు కృషి చేయాలని మానవ తామూర్తులు గ్రూప్ అడ్మిన్ బోనం రాజు ఆకాంక్షిస్తూ ఈరోజు కోనసీమ జిల్లాలోని మలికిపురం, మామిడికుదురు మండలాల్లోని కరవాక, గొల్లపాలెం, తూర్పుపాలెం, బట్టేలంకల్లో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీ చేసి ప్రజలకు పలు సూచనలు చేస్తూ 100 మందికి గుడ్డ సంచులను అందించారు. కార్యక్రమాల్లో మంగెన వెంకట నరసింహారావు, పెప్సీ బాబు, వీరా కృష్ణ, నరసింహ, భైరవమూర్తి, శ్రీనివాస్, రామకృష్ణ, కందుల విజయకుమార్, సాయిరాం, రాంబాబు, కాజా బుజ్జితో పాటు ఆయా గ్రామాల్లోని పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో మమేకం అవుదాం



తాటిపాకలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తూ ప్రజా సేవలో మమేకం అవుదామని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జరిగిన ఎన్నికల్లో రాజోలు నియోజవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం కోసం కష్టించి కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో జరగలేదన్నారు. ప్రజల అవసరాలను ఓదార్పు, ప్రజా సంకల్పయాత్రల ద్వారా గుర్తించి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఆర్థిక చేయూతనిచ్చారన్నారు. ప్రభుత్వపరంగా ఎలాంటి తప్పు చేయకుండా సంక్షేమ పథకాలు అమలు చేసి ముందంజలో నిలిచారన్నారు. కొత్త ప్రభుత్వం ప్రజావసరాలను, హామీలను నెరవేర్చని సమయంలో ప్రజల తరుపున నిలుద్దామని పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహపడవద్దన్నారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండల పార్టీ అధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, అడబాల బ్రహ్మాజీ, కుసుమ చంద్రశేఖరరావు, బొలిశెట్టి భగవాన్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, వక్ఫ్ బోర్డు మెంబర్ షరీఫ్, రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపురెడ్డి రాంబాబు, సోషల్ మీడియా కన్వీనర్ తాడి సహదేవ్, శివకోడు సర్పంచ్ నక్కా రామారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, జాన బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎండు గడ్డికి పెరిగిన డిమాండ్



ముక్కామలలో యంత్రాలతో కోసిన చేను

అంబాజీపేట: వరి కోత యంత్రాల ద్వారా పంటను నూర్పిడి చేయడంతో ఎండుగడ్డికి కొరత ఏర్పడింది. గతంలో రబీ పంటను కూలీలతో కోత కోసి ట్రాక్టర్‌తో నూర్పిడి చేయడంతో ఎండుగడ్డి లభించేది. అయితే ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అలవాటు పడిన రైతులు పంటను నూర్పిడి చేయడానికి వరి కోత యంత్రాలను వినియోగించడంతో ఎండుగడ్డిని ఒబ్బిడి చేయడానికి రైతులు ఆసక్తి చూపించడం లేదు. ఇటీవల పశువుల ఎండుగడ్డికి డిమాండ్ పెరిగింది. దీంతో చేలల్లో పడి ఉన్న ఎండుగడ్డిని ఒబ్బిడి చేయడానికి రైతులు యంత్రాలను, కూలీలను ఉపయోగిస్తున్నారు. కొంత మంది రైతులు చేలల్లోన్న గడ్డిని కూలీలతో ఒబ్బిడి చేస్తుండగా, మరికొంత మంది గడ్డిని కట్టలు కట్టే యంత్రంతో ఎండుగడ్డిని కట్టలు కట్టించి, గడ్డివాములు వేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో పశుపోషణ పట్ల రైతులు ఆసక్తి కనబర్చడంతో గతంలో కంటే ఈ సారి చేలల్లో ఉన్న ఎండుగడ్డిని ఎక్కువగా సేకరిస్తున్నారు. ఎకరా ఎండు గడ్డి ప్రస్తుతం రూ.3 వేల నుంచి రూ.4 వేలు వరకు పలుకుతుందన్నారు. వీటితో ట్రాక్టర్ కిరాయి, కూలీలు ఖర్చు కలిపి మరో రూ.1500 నుంచి రూ.2,500 అదనంగా అవుతుందని రైతులు చెబుతున్నారు.

వైభవంగా పళ్లాలమ్మ తీర్థం



పళ్లాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ దేవత పళ్లాలమ్మ తీర్థం బుధవారం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా సిరిబొమ్మను గ్రామంలో ఇంటింటికీ ఊరేగించారు. తీర్థం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ముడుపులు, మొక్కులు సమర్పించారు. సోమవారం నుంచి అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం భారీ అన్న సమారాధనతో అమ్మవారి జాతర మహోత్సవాలు సంపూర్ణమవుతాయని ఆలయ కమిటీ తెలిపింది. తీర్థం సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

మలేరియా వ్యాధిపై అవగాహన



మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న రాజుబాబు

అయినవిల్లి: మలేరియా వ్యాధిపై కొత్తపేట సబ్ యూనిట్ అధికారి ఎస్.రాజుబాబు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం అయినవిల్లిలంకలో మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అయినవిల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. హాజరైన ఎస్.రాజుబాబు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. దోమలు నిల్వ నీటిలో వృద్ధి చెందుతాయన్నారు. దోమ లార్వా ఎలా వృద్ధి చెందుతుందో ఆయన వివరించారు. లార్వా వృద్ధిని అరికట్టాలంటే ట్యాంకుల్లోను, ఇంటి పరిసరాల చెత్త నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద రావు, ఎంపీహెచ్ఏ, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. రవికుమార్ బుధవారం తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మి పోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాలువలో చెత్త... ప్రవాహానికి అడ్డంకి



ఇసుకపూడి పంట కాలువలో ప్రవాహానికి అడ్డంకిగా మారిన చెత్త

అంబాజీపేట: కాలువలకు నీరు విడుదలైందని రైతులు ఓ పక్క ఆనంద పడినా.. పేరుకుపోయిన చెత్త అడ్డంకిగా మారడంతో నిరాశ చెందుతున్నారు. ఇరుసుమండ, మొసలపల్లి, మాచవరం, ఇసుకపూడి, గంగలకుర్రు అగ్రహారం, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. అయితే కాలువలో పేరుకుపోయిన చెత్త ప్రవాహానికి అడ్డంగా మారి చేలకు నీళ్లందే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సార్వా సాగుకు దుక్కు దున్ని నాట్లు వేయాల్సి ఉండగా.. నేటికి పంట బోదెల్లోకి చుక్క నీరు రాలేదు. ఈ పాటికే అధికారులు ప్రణాళికతో కాలువలో చెత్తాచెదారం తొలగించి ఉంటే ఈ దుస్థితి ఏర్పడేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించి పొలాలకు సాగు నీరందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కాలువలో చెత్త, వ్యర్థాల వల్ల నీరు ముందుకు సాగడం లేదని సంబంధిత ఇరిగేషన్ అధికారి దృష్టికి తీసుకువెళ్లేందుకు కార్యాలయానికి వెళ్తితే అందుబాటులో లేరని రైతులు చెబుతున్నారు.

ఘనంగా తాటమ్మ వారి పెద జాగరం




పి.గన్నవరంలో వేంచేసిన తాటమ్మ వారి ఆలయం వద్ద కాగడాలు వెలిగిస్తున్న భక్తులు

పి.గన్నవరం: గ్రామ దేవత తాటమ్మ వారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి పెదజాగరం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు, చిన్నారులు కాగడాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గురువారం జరిగే తీర్థ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని ఆలయ ట్రస్టీ సుంకర రాంబాబు విజ్ఞప్తి చేశారు.

భవితకు పునాది

- సెలవుల్లో సరికొత్త కోర్సులు
- కంప్యూటర్ శిక్షణపై విద్యార్థుల ఆసక్తి
- స్వల్పకాలిక కోర్సులపై ప్రత్యేక దృష్టి



ముమ్మిడివరంలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ముమ్మిడివరం: వేసవి సెలవుల్లో ఏడాది పాటు పాఠ్య పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఇప్పుడు వాటిని అటకెక్కించారు. కొంత మంది సెలవులు ఆరంభంలో బంధువుల ఇళ్లకు చెక్కేస్తే, మరికొందరు తీర్థయాత్రల బాట పట్టారు. ఇప్పుడున్న ఖాళీ సమయాన్ని విద్యార్థులు సమర్థంగా వినియోగించుకుంటున్నారు. చాలా మంది విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల్లో చేరి ఉపాధి అవకాశాలను మెరుగు పర్చుకుంటున్నారు. అలాగే స్వల్ప కాలిక కోర్సులపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో మంచి ప్రతిభ కనబర్చడానికి కంప్యూటర్ శిక్షణా కేంద్రాల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులను ఆకర్షించేందుకు శిక్షణా కేంద్ర నిర్వాహకులు వివిధ కోర్సులకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తూ ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు ఆరు కంప్యూటర్ శిక్షణా కేంద్రాలు ఉన్నాయి.

వివిధ కోర్సులు

ఈ శిక్షణా కేంద్రాల్లో కంప్యూటర్‌కు సంబంధించి ప్రాథమిక అంశాలతో పాటు, సీసీఏ, డీసీఏ, పీజీడీసీఏ, జావా, సీ లాంగ్వేజ్, టాలీ, ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, ఇంటర్నెట్, హార్డ్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో కంప్యూటర్ విద్యపై పరిజ్ఞానం పెంచుకుంటే ఉన్నత విద్య సమయంలో విద్యార్థులు మంచి ప్రతిభ చూపుతారని తల్లిదండ్రులు కూడా వారి పిల్లలకు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. అలాగే వివిధ పోటీ పరీక్షలకు కూడా శిక్షణ పొందుతున్నారు.

ఉన్నత ప్రమాణాలు పెంచుకునేందుకు..

భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకునేందుకు కంప్యూటర్ శిక్షణ పొందుతున్నాం. ఉద్యోగం కోసం తీవ్ర పోటీ నెలకొన్న సమయంలో కంప్యూటర్ శిక్షణ చాలా అవసరం. అందుకే ఈ శిక్షణ తీసుకుంటున్నాను.

– కొమ్మిరెడ్డి హనుసాయికృష్ణ, విద్యార్థి

నామమాత్రపు ఫీజులతో..

వేసవి ఖాళీ సమయంలో వస్తున్న విద్యార్థుల కోసం పలు కంప్యూటర్ శిక్షణా సంస్థలు తక్కువ ఫీజులతోనే బోధన చేస్తున్నాయి. ప్రాథమిక అంశాలకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు, ఎంఎస్ ఆఫీస్, పీజీడీసీఏ లాంటి కోర్సులకు రూ.2,500 నుంచి రూ.4 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వంతో ఒప్పందం మేరకు కొన్ని శిక్షణా సంస్థలు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచితంగానే బోధనలు చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 2 వేల మంది విద్యార్థులు కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందుతున్నారు.